# పరిణామం ★

రచయిత్రి :
... కె. యస్. లక్ష్మి ...

"పండువెన్నెలపిండియారబోసినట్లుంది. కిటికీచువ్వల సందునుంచి నిర్మలాకాశం వినీలపుకాంతితో కన్పిస్తుంది. భూతాలల్లే మబ్బుతునకలు చందమామ నావహించడానికి తరుముకువెడుతుంటే, స్వచ్ఛందమైన ధవళకాంతితో వాటికి అందకుండా అంగలు వేసుకుంటూ అతి త్వరితంగా పరుగుపెడుతున్నాడు జాబిల్లి.

ప్రకృతి ప్రశాంతంగావుంది, అంతలోకే సహించలేనట్టు నిర్మలత్వాన్ని నిర్మూలనం చేస్తూ, రెక్కల రెపరెపల సవ్వడితో పైకెగురుతూంది, ఓ జంటలేని వంటిపక్షి. ఆ వంటిపక్షికి, నాకూ ఏమీ భేదంలేదు అనుకుంది సరోజ.

తన జీవితచరిత్రలో గడచిపోయిన మధుర స్మృతులు దృష్టిపథంలో పరుగులెట్ట నారంభించాయి. ఒకనాటి ఆతనిమాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటూ మారుమ్రోగింది.

"సరూ, బూజుపట్టిన సంఘానికి నవజీవన వాతావరణం కల్పించాలి. మలినంపట్టి సంకుచిత హృదయాలతో కుళ్ళి కృశించిపోతున్న మనలోకానికి, అమృతబిందువులు చిలకరించి నవదృక్పథం ఏర్పరచాలి. విశాలహృదయం ఏర్పరచాలి. అంతేకాని సంఘం చేతిలో కీలుబొమ్మలై, దాస్యానికి దాసోహం అని ఆత్మస్వాతంత్ర్యం చంపుకొని, బండచాకిరీలతో అజ్ఞాతవాసం చేస్తున్న తోటి స్త్రీల స్వాతంత్ర్యంకోసం నీబోటి విద్యాధికురాండ్రు ముందంజవేయకపోతే ఏలాగు చెప్పు?

స్త్రీలను కేవలం పిల్లలకనే యంత్రాల క్రింద, మగవారి స్తోత్రాలకై పుట్టిన మంత్రాల క్రింద, మత్తునుపోగొట్టే తంత్రాలక్రింద అవసరాలుతీరిన అనంతరం హృదయంలేని పాషాణాలక్రింద భావిస్తూ, సంఘాన్ని మరామత్తు చేస్తామంటూ లేనిఅధికారం పైనవేసుకొని దబాయింపచూసే సంఘ సంస్కర్తల ఆట కట్టుటకు నీవంటిస్త్రీలు కచ్చలు బిగించి రంగంలోకురికి, స్త్రీ జనాభ్యుదయంకోసం, స్త్రీల సమాన ప్రాతినిధ్యంకోసం పాటుపడాలి" అంటూ యింకా ఏమేమోచెప్పి ఉద్రిక్తపరచాడు రంగనాథం. రక్తం వేడెక్కింది, అవునని మనస్సుతాళంకొట్టింది, నిజం అని సమ్మతించింది అంతరాత్మ.

వాస్తవికానికి రంగనాథం చెప్పిందంతా సత్యమే. కాని స్త్రీ స్వాతంత్ర్యం కోసం తాను గడ్డిపోచంత కృషి చేయలేకపోవటం మాని తుదకు తనజీవితం మట్టిపాలయింది. స్త్రీ స్వాతంత్ర్యం అన్నమిషతో ఆతని కల్లబొల్లి మాటలను నమ్మి తన ఆత్మస్వాతంత్ర్యానికి భంగం తెచ్చుకుంది.

స్వతంత్ర జీవనాభిలాషియై ఉపాధికోసం ఓ కంపెనీలో టైపిస్టుగా చేరింది. కాలానికి తలవొగ్గి తన మానాన రోజులు దొర్లిస్తూ, ఆ ఆఫీసులోనె పనిచేస్తున్న రంగనాథంస్నేహం తను స్వబుద్ధితో ఆసించలా. ఆతనే తనతో స్నేహం అభిలషించి నమ్రతతో అతి చాకచక్యంగా, నాతన్న నేను బుర్రవంచుకుపోతూంటే, ఏదో సంభాషణ కల్పించి, ప్రస్తావిస్తూ నాస్నేహం వాంఛించాడు.

"ఆతని అసభ్య ప్రవర్తనకు నాకు చాలా అసహ్యంవేసి నాలోనె నిందించేదాన్ని. ఆ మొదటి దినాలలో ఆతన్ని గర్హించని ఘడియలేదు! అయినా ఆతను అంతతో విడువక నాయందు అభిమానం కన్పరుస్తూ ఎంతో ప్రేమ, దయతో వెంటఅంటి మెలగటం ఆరంభించాడు. అప్పుడు నా మనస్సు నాకెంతో క్రూరంగా ప్రవర్తించినట్లు తోచింది. అవును ఆతనిపై అంత కాఠిన్యత పూనడానికి రంగనాథం ఏమంత తప్పుపని చేసాడు?... నా మనస్సులో రవ్వంత చోటిచ్చింది. ఆతను అంతమాత్రానికే ఎంతో సంతోషించి కృతజ్ఞత చూపించాడు.

మా ఇరువురిమధ్య స్నేహం దృఢపడింది. ఆతని మధురమయ సంభాషణలు నన్నాకర్షించాయి. రంగనాథం ఒక్కొక్క విషయం ఎత్తుకుని చక్కగా మాట్లాడుతుంటే, ఆతని గంభీరభావాలు ఎంతో ముచ్చటగా వుండేవి. ఎంతసేపువిన్నా యింకాయింకా వినాలని మనస్సు ఉర్రూతలూగేది.

సంతోషాని కంతులేకుండా రోజులు పరుగెడుతున్నాయి. దినాలు గడిచేకొద్దీ ఇరువురి మధ్యా స్నేహం, ప్రేమబాంధవ్యంగా పరిణమించింది. ఆతను చెప్పినమాటలు యింకా హృదయంలో మారుమ్రోగుతున్నాయి.

"సరూ! ఏనాడు ప్రథమ ముహూర్తంలో చూచానో ఆనాడే నా యవ్వన సౌందర్యం నీ పాదాలకు అంకితం చేసాను. ఆ రోజునే నా జీవనమాధుర్యత నీసోగకన్నుల పసిడిరేకులకు అర్పణం చేసాను. ఐతే బంగారానికి పరిమళం అబ్బినట్లు నీ అంగీకారంతో మన భావిజీవితం స్వర్గానికి మెట్లుకడుతుంది. ఈ ప్రేమజంటకు రెక్కలువచ్చి ప్రేమసీమలో విహరించగలవు. సరూ! హృదయానికి హృదయంగా ప్రేమించి, అంజలి ఘటించా, నీ యిష్టం. అమృతబిందువులో అగ్నికణాలో" అని. మౌనంగా తటస్థభావం వహించా. ఆతను ఉత్సాహంతో తన బిగికౌగిలిలో బంధించి ముద్దులవర్షం కురిపించాడు. సిగ్గుతో నాకళ్లు మూతలు పడ్డాయి. ఏమో తెలియని మగత కప్పింది కంటికి.

"ప్రేమ ప్రవాహంలో రోజులు గంటల్లా గడచిపోసాగినై. కాలచక్రం మహావేగంగా పరుగిడుతోంది. కాలప్రవాహంలో ప్రేమ తెలియనికాలం చూస్తూండగా ఆరుమాసాలు గడచిపోయి అదంతా ఓ విచిత్రనాటకంలా ముగిసింది. ఆరోజులు గడచిపోయాయి.

రంగనాథం మొదటివలె తనతో మాట్లాడుటకు అంత ఉత్సాహం కన్పరచ, తనపట్ల

విముఖత చూపుతూ తప్పించుకు తిరగటంతో ఎన్నో ఆలోచనలు బుర్రలో పరుగులెట్టాయి. ఆతను అన్నది వాస్తవం తన్ను అగ్నిసాక్షిగా వివాహం చేసుకొంటాడు. తను యింక ఏకాకి జీవితం గడపనక్కరలేదు. ఆతను చెప్పినట్లు తమ భావిజీవితం పూలతెప్పపై తేలిపోతుందని భావించింది. కాని అంతలోకె అతని వింతప్రవర్తన తీరని భయాన్ని కల్గించింది. మనస్సులో నిర్మించుకొన్న ఆశాసౌధాలూ ఒకొక్కటే బీటలువారి నేలకు వరుగుతున్నాయి. ఊహించిన పూలబాట దారితెన్నూ లేని అంధకార సముద్రం లో ముళ్ళకంచెకు అంటతీసికట్టి ముంచి తేలుస్తున్నట్లైంది. మరల అంతలోకె మనస్సు స్థిమితపరుచుకొంది. మనస్సు సరిపెట్టుకుంది. "ఇదంతా పిచ్చిగాని నాపై ఆతనికి కోపం ఏమిటి?" అని ఆలోచన్ల కంతరాయం కల్గిస్తూ గోడగడియారం టంగ్ మని ఒంటిగంట కొట్టింది. దాంతో ప్రకృతిలోపడి నిద్రించ ప్రయత్నించింది కాని నిద్రపట్టలా.

* * *

పదిగంటలకల్లా ఆఫీసుచేరింది, ఎదురుగా కుప్పలా పడివున్నాయి టైపు చేయవలసిన కాగితాలు. వెళ్ళి కుర్చీలో కూర్చున్నదే కాని బుర్రలో ఏవో వెర్రిఆలోచనలు పరుగులెడుతున్నాయి. టైపు మిషనుమీద వేళ్ళు నడవటంలేదు. ఏమిటో అంతా అయోమయంగావుంది, ఆలోచన్లలో పొద్దు గడుస్తూంది. అతి కష్టంమీద ఏవో నాలుగు వుత్తరాలు పూర్తిచేసి, నెమ్మదిగా రంగనాథం గదిలోకి నడిచింది. బుర్ర వంచుకొని ఏదో రాస్తూన్నాడు రంగనాథం.

"కన్పించటం మానేశావేం కోపం వచ్చిందా?"

"ముఖం పైకెత్తి ఆశ్చర్యంగా అబ్బే ఏమీలేదు. సాయంత్రంవస్తా పని కొంచెం తొందరగా వుంది."

"ఆ! అయితే మరి నేవెడతా. తప్పకుండా సాయంత్రం రా" అని తనగదికివచ్చేశింది. కొంతభారం తీరినట్లయింది. త్వరితంగా ఆఫీసుపని ముగించుకొని నాల్గు గంటలకు యింటికి చేరింది.

బుర్రంతా ఏదో ఆలోచనలు పరుగెడుతున్నాయి. వృద్ధాప్యంవచ్చిన తల్లిని విడిచి, కాదు కూడదని ఆమెను ఒప్పించి ఏదో వెలగపెడదామని, గంపెడాశతో యింటివద్దనున్న తల్లిని ఉద్ధరిద్దామని, స్వయంపోషకంగా, జీవితం గడుపుదామని ఉద్యోగంలో ప్రవేశించింది. ఇంక ఏ ఇబ్బందులు లేకుండా సుఖజీవనంచేస్తూ తల్లిని పోషించుకోవచ్చనని, ఏమేమో ఊహించింది.

వంటరిదానవు పట్నవాస జీవితం. అతి జాగ్రత్తగా మసులుకోవాలి. ఏమో ఏలావుంటూవో అని హెచ్చరించిన తల్లికి, సరోజ అంత అవివేకులుగానె తలుస్తున్నావా అమ్మా! అని సగర్వంగా జవాబుచెప్పి, చూస్తూ చూస్తూ అమ్మ అనుమానించినట్లుగానె చేసాను, ధగధగమెరిసే నిప్పుకళాన్ని చూసి, తాకితే కాలుతుందని తెలిసి, గట్టిగా కావులించుకున్నా. ఆనాడు అమ్మతో అన్ని శ్రీరంగనీతులు చెప్పి, ఈనాడు రంగనాథం అంగీకరిస్తేనె సరికాని, లేకపోతే ఈ నా ఎంగిలిముఖం అమ్మకు ఏలా చూపించగలిగేది? నిర్మల మనస్సుతో ఆనాడు చెప్పిననాలిక యీనాడు నీరుకారిపోయిందని, నీతి నీటకలిసి నీచంగా ప్రవర్తించానని ఏలా చెప్పేది? తిరిగి నా యీ పాపిష్టిముఖాన్ని అమ్మకు చూపటమా?

చూపిస్తాను. నొసట కుంకుమబొట్టుతో పసుపుముద్దలైన మధుపర్కాలతో ప్రణయ దంపతులం అమ్మపాదాలముంగిట ప్రణమిల్లుతాం......"

అంతలోకె ఆలోచన్ల కంతరాయం కల్గిస్తూ సరూ అంటూ లోనికి ప్రవేశించాడు రంగనాథం. ఆహ్వానించి కూర్చోపెట్టింది.

"ఆతని ముఖంలోకిచూస్తూ రంగనాథం" అన్నది.

"ఎందుకు రమ్మన్నావు?"

"మరి మన వివాహం ఎప్పుడు?"

"వివాహం, ఎవరికి? ఎందుకు?...... ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ తిరిగి ప్రశ్నించాడు.

"ఎవరిగొడవో మనకెందుకు? మన వివాహంమాటే."

"నీతోనా! అలాగ ఎప్పుడూ చెప్పలేదే..."

"ఇదేమిటి రంగనాథం ఈలా మాట్లాడతావని ఎప్పుడూ అనుకోలేదు. నీవు నమ్మించలేదా నన్ను పెండ్లాడతానని? నిన్నే పెండ్లాడతానని నమ్మించి నా మానం చెరచి తుదకు నా జీవితం అపనిందల పాలుగావించి నిర్మూలంచేస్తావా? నా జీవితవృక్షం కూకటివ్రేళ్ళతో పెకలింపచేస్తావని, ఇంత పాపం దుడవని అనుకోలేదు. ఏదో స్త్రీ స్వాతంత్ర్యం అంటూ యిచ్చిన ఉపన్యాసాలకి మోసపోయి నీ క్రూరహృదయాన్ని గ్రహించలేకపోయా."

"సరూ! చాలించు,వంటిచెయ్యి ఎంతగింజుకొన్నా ఏమీ లాభంలేదు. ఆచెయ్యి కాచెయ్యి కలసినప్పుడే ఏం జరిగినా, రెండు చేతులూ కలిస్తేనే చప్పుడుకాని లేకపోతే లేదు. తెలిసిందా? నీవు అంగీకరించావు. నేను అనుభవించాను. ఇందు నా తప్పు ఏ మాత్రంలేదు. సెలవు" అని చరచరా బయటికి నడచి వెళ్ళిపోయాడు రంగనాథం.

"ఏదో చెప్పరాని అసంతృప్తి, అవ్యక్తమైన మనోవ్యధ మనస్సులో పీడించసాగినై. రంగనాథం తుచ్ఛమైన కామవాంఛకు లోనై కామాన్ని తెలియక పవిత్రమైన ప్రేమ అని ఉచ్చరించి, ఆ కాలంకోసం వేచియుండి, కామానికి కాలంకలిస్తే, కామతృష్ణ తీరిన తర్వాత పైముసుగైన ప్రేమలో ఈర్ష్య, ఆ కామస్థానంలో జుగుప్సచేరాయి. పవిత్రమైన ప్రేమకు కామం ముడిపెట్టి ప్రతిఫలకాంక్ష తీరినవెనుక, వెర్రిచూపులు, మొర్రికూతలు, వెగటుభావంతో నా జీవితం నాశనంచేసి దయచేసాడు.

మనస్సంతా ఏదో చెప్పరాని ఆందోళనతో బరువెక్కింది. బుర్రంతా ఆలోచనలతో వేడెక్కిపోయింది. కళ్ళమ్మట నీళ్ళు రాలాయి. అవమానం శరీరాన్ని దహిస్తోంది బ్రతుకుభారంగా తోచింది.

ఎంగిలి జీవితం నిందలబ్రతుకు స్వార్థసంఘంలో గడపటం, దుర్భరం, దుర్ఘటంగా తోచింది. అంతలోకె ఏదో నిశ్చయురాలైంది.

అర్ధరాత్రి నిర్మానుష్యంగావుంది ప్రకృతి. ఎక్కడికో చరచరా నడిచి వెళ్ళిపోతూంది సరోజ. ఎక్కడికో ఏమో నిండుజీవితాన్ని నిశ్శేషం చేసుకోవటం కోసమే కాబోలు!"